# గున్నయ్య గర్భాదానానికి పూర్వం.

యాదూరి వీరరాఘవరావుగారు.

గున్నయ్యచదువు గుణింతాలపర్యంతంవచ్చేసరికి మహాప్రళయంపట్టి భూనభోంతరాళాలు ప్రళయకాలజంఝామారుతంలో దడదడవణకసాగాయి. అక్కడికి తృప్తిపడి తిలలతో సహాచదువుకు నీళ్లొదిలేశేడు. మనిషికాస్త పచ్చపచ్చగావున్నాడు. ఏదో పెద్దలుగడించిన కొంద్రకాస్తవుంది.. దాంతో కాలక్షేపంచేస్తూవున్నాడు. మనిషిదగ్గిర నవీనప్పోకడలేమీలేవు. దగ్గర, పాలెంలో ఒకసమంధంచూసి తల్లి అతగాడి బ్రహ్మచర్యానికి స్వస్తిచెప్పించింది.

మనిషికుండవలసిన లక్షణాలన్నీ యితగాడిపట్ల సత్యంగానే వున్నాయికాని రెండేకొంచెం విపరీతంగా పరిణమించాయి.—తాబట్టినకుందేటికిమూడేకాళ్ళనే తిక్కఘటం—తనకునచ్చదు; యితరులుబోధిస్తే కర్ణపర్వంకాదు. తల్లిమాత్రంయేంచేస్తుంది పాపం ? ఈ అడివిజంతువుని ఆధారంగాచేసుకుని రోజులు గడుపుకొస్తోంది.

యీసందర్భంలో సదరు గున్నయ్య జంతువరూపురేఖావిలాసాలు వర్ణించడంకొంచెం ఆవశ్యకం. ఈజంతువపొడవు నాలుగడుగుల ఆరంగుళాలు. అందులోసగం పొడవు పొట్ట మినహాయించుకుంటే మిగతావికాళ్ళుతలాపంచుకున్నాయి, బొడ్డుచుట్టునున్నపొట్టకైవారం పీపాకట్టుకిరెండింతలు, చేతులు సన్నంగా అప్పడాలుకర్రల్లావుంటాయి, వెలక్కాయంతతల, తీతువకాళ్ళు మొత్తానికి అందరికి బాహాటంగా అవుపించేది అతగాడిగర్భగోళంమాత్రమే. మిగతాఅంగసమూహం వున్నాలేనట్టే! మనిషిరమారమీ రెండుపుష్కరాలుచూశాడు. రొయ్యిమీసాలు. నాటుకోటిస్సెట్టి కోటికిపడగెత్తినట్టు దృపస్థా
మంచు ఆకమ్మముడిచూట్టూ ప్రహారికోటకి కందకం
లావిరాజిల్లుతోంది; భ్రూమధ్యానికితిన్నగా, నెత్తి
మీదమిఠాయిపొయ్యి. శ్యామలవర్ణం పనసపెచ్చుం
తమృదువయిన ముఖారవిందం మేకకళ్ళు గరుత్మంతు
డుముక్కు కోతిచెవులు, సదరులక్షణాలనుపట్టి ఈ
జంతువెంతసొంపుగా వుంటుందో పాఠకమహాశయు
లూహించుకోవల్సిందే ?

౨

వొహరోజున ఈవింతజంతువ ధూమసేవజే
స్తూ వాకిట్లోనులకమంచంమీదకూర్చుని ఒకపిల్లిపిల్ల
తోసరసాలాడుతూవుంటాడు. ఇంతట్లో కిర్రుచెప్పుల
చప్పుడు వినవచ్చింది. గున్నయ్య చెవులురిక్కబెట్టి
వొళ్ళంతాకళ్లుచేసుకు చూస్తున్నాడు యెవరావచ్చే
దని. ఒకపదిమళ్ల జంతువ వాకిట్లోకొచ్చి నిలబడింది.
ఆవిగ్రహాన్నిచూశి గున్నయ్యవిస్తుపోయాడు. ఒక
పదినిముషాలయాక పోల్చుకున్నాడు స్వయానాతన
కుపిల్లనిచ్చినమామగారిని. అతడిపేరు సుబ్బారాయు
డు అతడిశరీరంలో అల్లుడిశరీరం అణుమాత్రం—
మహాసముద్రంలో కాకిరెట్టవంటిది. ఆకోరపాగా,
ఆబుగ్గమీసాలు, ఆవకాయగూనవంటి ఆపొట్ట వక్ష
స్థలం మీదఅమోనియాపిండివేసిన అరటితోటలా
యెదిగిన ఆకేశసముదాయం, వడియంకన్నపురవైన
ముక్కు పెసరప్పడాల్లాఆచెక్కిళ్ళు వొంటిచెవికి వేలా
డుతూవున్న ఆకానబావిలీ ముక్కునకాడా చేతులికి
గోడుమురుగులు చిటికెనవేలినకొబ్బరుంగరం నోట్లో
తిరగటిగురుజంత ఆచుట్ట—ఇవన్నీ స్వయంగాచూశి

...రించవల్సిందేగాని విన్నంతమాత్రాన తృప్తి నేడికల ...నేరదు. అజంతువ ఒక్కగోంగ్రడింపుగోంగ్రడించి అల్లుడ్ని, కుశలప్రశ్నాదికాలతో పరామర్శించింది.

"ఏంటోయి అల్లుడోడా ఇశ్శేమకాలు ?"

"ఏంవున్నాయిమావా, శానాలకొచ్చావు."

"మీాఅకుమళ్లాఖరయినట్టేనా ?"

"వో శెలకదిగడ్డది."

"రేపుఇగ్గినేసురుకుసయితికినువ్వు రావాలసుమ్మా మీాఅత్తమరిమరిశొప్పింది ?"

"ఆలాగేకానిమావా మరినాగర్బాదానంమాట ఏటితేల్చావు ?"

"మూడుపులాఖరవనీ మంచిరోజుచూచిఅయిందనిపిద్దాం ?"

"తప్పకుండాసెయ్యాలిచుమా."

"అలాగేనోయి మరినేవెల్తాను నువ్వు సయితికి ఇదాయికంగారావాలి చుమ్మా మీాయత్తమరి సొప్పింది.''

" అలాగేవత్తా.''

3

పాడ్యమినాడు పసందుగావుందోయి అని సింహాపుధాన్లుగారు పొంచుంచిటకా పీలుస్తూ శెలవిచ్చారు. అయిసర్ బొజ్జాఅని గున్నయ్య మహాశయుడు ప్రయాణభేరీ వేయించాడు. మంగలి సరప్పగాడి చేతిలో ఓబేడ పడేశి గెడ్డంతుశిపించాడు. కోరమీాసాలు సూరకత్తుల్లా దిద్దించాడు. బట్టలన్నీ యిస్త్రీ చేయించి ఓట్రంకు పెట్టెలోపెట్టి ఓపన్ని కొబ్బరినూని ఓసీసా భార్యాగార్కి బహుమతీగా నాల్గు పెసరపుణుకులు బెత్తెడు బంగారంలాటి తాటితాండ్ర పడేశాడు. శుభస్య శీఘ్రంఅని జండామెత్తేడు.

౪

ఆదర బాదరవుతూ అర్ధరాత్రివేళకి అత్తారిల్లు చేరుకున్నాడు. కలతనిద్దరతో మెట్టికి తెల్లారిపోయింది. మావగారు, బావమరుదులు వగయిరాలంతా రాకరాక వచ్చాడని అతగాణ్ని చాలా ఆదరించారు. కాని యితడిదృష్టంతా వేరే వుంది—భార్యా రత్నం ఒక్కమాటు కళ్లబడితే బావుండునను కున్నాడు. భార్యా పుష్పవతి అయ్యాక అతడు ఆమెను ఒక్కమాటూచూడలేదు అంచేత యీాసారి ఏలాగేనా ఆదివ్యదరిశనం పొందుదారని గొప్పదీక్షతో వున్నాడు. భావమరుదులు మావగారు మొదలయిన మగపురుగులంతా చద్దన్నంతిని పొలాలకు వెళ్లేరు.

౫

అది పవలు పండ్రెండుగంటలవేళ. లక్షణంగా భోంచేశి చుట్ట అడ్డపొగపెట్టి వీధిచావటిలో పడకకుర్చీలో దర్జాగా కాళ్లుజాపి పరుండి యేదో వుపద్రవంగా ఆలోచిస్తూవుంటాడు గున్నయ్య, అంతలో ఒక ఆరేళ్లపిల్ల అక్కడికివచ్చి మనజంతువుని చూసి బెదిరి పరుగెత్తబోయింది.

"దా, దా, గరగలమ్మా" అంటూ ఆచిన్నదాన్ని వొంటాడి చంకనెత్తుకున్నాడు, ఆపిల్ల కేరుమనేశ్సింది. "యేడుత్తావేం మరదలపిల్లా" అంటూ బుజ్జగించి ముద్దెట్టుకున్నాడు. కాని ఆపిల్ల శంకిణీలా అదేయేడుపూ! ఆయేడుపు విని పెరట్లోంచి అత్తగారు గుభీమని చక్కావచ్చింది. అత్తగార్ని చూసి గున్నయ్య సావరస్యంగా నవ్వేడు. అతడు పలికిన ప్రతి పలుకులోనూ మధువు కువ్వతివ్వులే! యేడుస్తూ వున్న పిల్లని ఆమె తీసుకొనబోయింది. మాత్తేరీ అం

టూ యేడుస్తూవున్న చిన్నదాన్ని వెనక్కులాగి ముద్దుమీద ముద్దు గుమ్మరించేడు. కుఱ్ఱది వుక్కిరిబిక్కిరియయి బేజారెత్తిపోయింది. గున్నయ్య జేబులోంచి ఒకపెసరపుణుకు తీసి దాన్ని రెండుకింద తుంపి ఒకటి తన నోటిలోవేశికొని రెండోది దానికిచ్చి నేనేగదా యోధుణ్ణి అన్నట్టు అత్తగారికేశి సరాగంగా చూస్తాడు. యితగాడి దృక్పథమునుండి తొలగిపోతే మేలనియెంచి గిరుక్కున వెనక్కి తిరగ్గా గున్నయ్య అత్తా అత్తా అంటూ వెంబడించాడు. అదిచూసి అత్తగారు, భీతహారిణయిపోయింది. గున్నయ్య జేబులోంచి ఓపెసరపుణుకు తీసి అత్తగార్కి Offer చేశాడు. అత్తగారు నిరాకరించింది. తినకపోతే నన్ను చంపుకుతిన్నట్టే అని ఆపుణుకు తీసి అత్తగారివక్షానికి గురిచూసి కొట్టేడు. చేసేదిలేక, స్మృతిమించి రాగాన్ని పడుతుందేమోయని భయపడి అత్తగారు ఆపుణుకుచ్చుకుని లోపలికి జారిపోబోయింది. అత్తా అత్తా అంటూ మళ్లీ వెంబడించాడు అల్లుడు. ఆయిల్లాలు లేని ధైర్యంతెచ్చుకుని యేవోయి అల్లుడా అని తీవ్రంగా అంది. "ఓపాలి నాభార్యాని యీలాపంపించు" అత్తగారు విస్తుపోయి, నీభార్యా యింట్లోకి రాడానికి యీల్లేదంది. గున్నయ్య మొహం వేలవేసుకున్నాడు.

౬

మరదలుపిల్ల పుణుకుముక్కతో కొంచెం మచ్చికైంది. అదిచూసి యీమాటు గున్నయ్య పుణుకు పుణుకంతా యిచ్చాడు. కుఱ్ఱది బావా అంటూ అతనితొడపై కెక్కి కూచుంది. దానినోట్లో కాస్త తాటితాండ్రతీసి కుక్కేడు. బావా నన్ను ముద్దెత్తుకోవూ. మీదమీదకొచ్చింది. గున్నయ్య సమయం కనిపెట్టేడు. మీాయప్ప యెక్కడేశ్ అని అడిగేడు. తూర్పుదొడ్డిలో రేగిచెట్టుకిందవుందనిసమాధానం వచ్చింది. గున్నయ్య కార్యనిశ్చయుడయ్యాడు. నాలుగంగల్లో రెండోకంటివాడికి తెలియకుండా తూర్పుదొడ్లో రేగుచెట్టుదగ్గరకి చేరుకున్నాడు. కీర్ మని శబ్దం. గున్నయ్య అడివిగాడిదయిపోయాడు. మరుక్షణంలో బడితలుచ్చుకుని యములాళ్లలా యిద్దరువ్యక్తు లక్కడికి ప్రత్యక్షమయ్యారు. చేసేదిలేక గున్నయ్య ఒకదెబ్బతిని రెండవదెబ్బ సూటిగ తప్పించుకుని దూకేశాడు. మళ్లీస్వగ్రామం చేరుకునేదాకా గున్నయ్య దా డాపలేదు. తనయింటిగుమ్మం తొక్కి మరీవెన్నక్కి చూశాడు. యెవరూ తరుముకురావటం లేదు బ్రతుకుజీవుడాయని యింట్లో బడ్డాడు.

అక్కడ గున్నయ్య మావగారూ భావమరిదిబడితెలు పారవేసి యింటికి చేరుకున్నారు. గున్నయ్యేడంటే గున్నయ్యేడన్నారు. యింకెక్కడి గున్నయ్య ? అప్పుడు గ్రహించారు—గున్నయ్యనే తాము తరిమికొట్టిందని. చేసేదిలేక నాలిక్కరుచుకున్నారు.

అమర్నాడే గర్భాదానానికి రమ్మంటూ గున్నయ్యకి శుభలేక వచ్చింది. శుభస్య శీఘ్రం అని కందాయిం పంతాచేసుకు బద్ధేరాడు.

యిలాటి విషయాల్లో ఓదెబ్బతిన్నా తగాదాలేదు.